నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళ వారం 4 జూన్ 2024
TUESDAY, JUNE 4, 2024

## అయ్యప్ప ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

కోటగిరి, జూన్ 3 : కోటగిరి మండలకేంద్రంలో చేపడుతున్న అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణ పనులను బోధన్‌లోని అయ్యప్ప ఆలయ పూజారి సంతోష్‌శర్మ సోమవారం పరిశీలించారు. పోల విఠల్‌రావు గుప్తా ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని స్థల దాత పోల విఠల్‌రావుగుప్తా తెలిపారు. కార్యక్రమంలో సూదం శంకర్, బర్ల సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

రుద్రూర్, జూన్ 3 : మండలకేంద్రంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. రుద్రూర్ మండలకేంద్రానికి చెందిన మహ్మద్ మగ్బూల్ తన గేదెను సోమవారం ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్తుండగా.. విద్యుత్ స్తంభానికి తగలడం, విద్యుత్ సరఫరా కావడంతో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. గేదెను ముట్టుకోకుండా జాగ్రత్త పడడంతో మహ్మద్ మగ్బూల్‌కు ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని బాధితుడు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. గేదె విలువ లక్ష రూపాయలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

## విఠలేశ్వరాలయంలో అన్నదానం

రుద్రూర్, జూన్ 3 : మండలకేంద్రంలోని విఠలేశ్వరాలయంలో బోధన్ పట్టణానికి నికి చెందిన ఉద్మీర్ సుజాతా మోహన్ సహకారంతో సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వైశాఖ ద్వాదశిని పురస్కరించుకొని అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చిదువ వీరేశం తెలిపారు. విఠలేశ్వరాలయం పునర్నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ప్రతి ద్వాదశి రోజున అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కౌలాస్ గంగాధర్, కర్క అశోక్, మోత్కూరి నారాయణ, టి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆదర్శ కళాశాలలో జాబితా ప్రదర్శన

ధర్పల్లి, జూన్ 3 : మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఎంపిక జాబితాను నేడు (మంగళవారం) ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జాబితా ప్రచురణ ఉంటుందని, ఎంపికైన విద్యార్థులు మూడు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ సెట్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## ధర్పల్లి ఏవోగా రవీందర్



బాధ్యతలు చేపడుతున్న ఏవో రవీందర్

ధర్పల్లి, జూన్ 3 : ధర్పల్లి మండల వ్యవసాయాధికారిగా వల్లకాటి రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 12 ఏండ్లుగా మండల రెవెన్యూ అధికారిగా పనిచేసిన ప్రవీణ్.. నెల క్రితం గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటివరకు సిరికొండ మండల వ్యవసాయాధికారికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం మోపాల్ నుంచి బదిలీపై వచ్చిన రవీందర్ ధర్పల్లి ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలానికి సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## స్కూల్ యూనిఫామ్ సిద్ధంచేయాలి



యూనిఫామ్ కుడుతున్న మహిళలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

ఆర్మూర్‌టౌన్, జూన్3: పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థుల యూనిఫామ్ కుట్టడం పూర్తి చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ ఆదేశించారు. మండలంలోని పిప్రి గ్రామంలో మండల సమాఖ్య సభ్యులు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. మహిళా సంఘాల సభ్యులు కుట్టుతున్న స్కూల్ విద్యార్థుల యూనిఫామ్‌ను పరిశీలించారు. డ్రెస్సులు కుట్టేపనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట ఏపీఎం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి



ప్రచారం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ నర్సయ్య

ఆర్మూర్‌టౌన్, జూన్3: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని కోరుతూ ప్రిన్సిపాల్ నర్సయ్య సూచించారు. మండలంలోని పిప్రి గ్రామంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు సోమవారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ తదితక సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా చెరువులు

- పెరిగిన గుర్రపు డెక్క
- పాండు చెరువులో తొలగించిన గంగపుత్రులు
- బెల్లాల్ చెరువును శుభ్రం చేయించాలని వేడుకోలు



పాండు చెరువులోని గుర్రపుడెక్కను తొలగిస్తున్న గంగపుత్రులు

శక్కర్‌నగర్, జూన్ 3: తమకు జీవనాధారం అయిన చెరువులు గుర్రపుడెక్కతో ప్రమాదకరంగా మారుతున్నాయని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో చేప విత్తనాలు వేసి, అవి పెరిగిన అనంతరం వాటిని పట్టి, విక్రయించి ఉపాధి పొందే తమకు చెరువులో గుర్రపు డెక్క, వ్యర్థ పదార్థాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. బోధన్ పట్టణంలో బెల్లాల్ చెరువు, బోధన్ పరిసర ప్రాంతంలో పాండు చెరువులు గంగపుత్రులు చేపలు పట్టేందుకు ప్రధాన వనరులు.

బోధన్ పట్టణంలో బెల్లాల్ చెరువు సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ద్వారా బోధన్ పట్టణ ప్రజలకు తాగు నీటి సౌకర్యంతోపాటు సాగునీరు అందుతోంది. బోధన్ పట్టణం, సంగం, అమ్దాపూర్ గ్రామాలకు చెందిన గంగపుత్రులు ఈ చెరువులో చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతుంటారు. సుమారు 15 ఏండ్లుగా ఈ చెరువులో గుర్రపు డెక్క పెరిగి, చేపలు పట్టేందుకు ఇబ్బందికరంగా మారుతోంది. చెరువును శుభ్రం చేయించాలని కోరుతూ గతంలో పలు మార్లు పలువురు వినతిపత్రాలు అందించినా అధికారులు స్పందించలేదని గంగపుత్రులు ఆరోపించారు. గుర్రపు డెక్క కారణంగా గతంలో పలువురు చేపల వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుర్రపు డెక్కను తొలగించిన తర్వాత పాండు చెరువు

బోధన్ పరిసర ప్రాంతంలోని పాండు చెరువు నిండా గుర్రపుడెక్క పెరిగి, మైదానాన్ని తలపించింది. గంగపుత్రులు స్పందించి ఆర్గానిక్ మందులు వినియోగించి ఈ చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను గతేడాది తొలగించారు. నీరు పరిశుభ్రంతోపాటు, ఇతర మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. అధికారులు స్పందించి బెల్లాల్ చెరువులోని గుర్రపుడెక్క తొలగించాలని గంగపుత్రులు కోరుతున్నారు.

### చిన్న చెరువుకే రూ.15లక్షలు వెచ్చించాం..



పాండు చెరువులో గుర్రపు డెక్కను తొలగించేందుకు సుమారు రూ.15లక్షలు వెచ్చించాం. పలువురు పెద్దల సూచనల మేరకు ఆర్గానిక్ మందులు తెచ్చి గుర్రపుడెక్క నివారణలకు చర్యలు చేపట్టాం. గుర్రపుడెక్క కారణంగా చేపల వేటకు వెళ్లి పలువురు మృతి చెందారు. గుర్రపుడెక్క తొలగించాలని గతంలో అధికారులకు వినతిపత్రాలు అందించాం. అయినా ఎవరూ స్పందించలేదు. చిన్న చెరువుకే రూ. 15లక్షలు ఖర్చయ్యాయి. బెల్లాల్ చెరువు తమకు ముఖ్యమైనది. ఈ చెరువులోని గుర్రపుడెక్కను తొలగించేందుకు ప్రభుత్వ సాయం చేయాలి.

**- కోట అబ్బయ్య, బోధన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు**

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత



విద్యార్థులను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘ సభ్యులు

ధర్పల్లి, జూన్ 3 : ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మండలకేంద్రంలోని పద్మశాలీ సంఘ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన దాసరి శ్రీశాంత్, మాదాసు లక్ష్మీరాజ్, మాదాసు రాఘవ, చాట్ల చందన, దోమకొండ అక్షయను సంఘ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు పాము నారాయణ, ఉపాధ్యక్షుడు దువ్వ భూమేశ్వర్, కోశాధికారి డాక్టర్ అంకం ఆనంద్, కార్యదర్శి క్యాదరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జెండా ఆవిష్కరణ

కోటగిరి, జూన్ 3 : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా కోటగిరి మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను స్థానిక గ్రామపార్టీ అధ్యక్షుడు అనిల్ కులకర్ణి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కూచి సిద్ధు, సైలంపూర్ హౌగీరావుపటేల్, సాయిలు, సాయిబాబా, విష్ణు, ఆకుల పోశెట్టి, గంగాప్రసాద్‌గౌడ్, వడ్ల విజయ్, హెచ్.విజయ్, మారుతి, లాలయ్య పాల్గొన్నారు.




కోటగిరిలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్

## బద్రినాథ్‌కు చేరిన పాదయాత్ర

- 1900 కిలోమీటర్ల మేర కాలినడకన
- 70వ రోజు దర్శనం చేసుకున్న భక్తులు



బద్రినాథ్ ఆలయం వద్ద కౌల్‌పూర్ భక్తులు

నందిపేట్, జూన్ 3: మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామానికి చెందిన పరమహంస భూమా యోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రినాథ్ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టిన భక్తులు 70వ రోజు సోమవారం ఆలయానికి చేరారు. 1900 కిలోమీటర్ల మేరకు కాలినడకన వెళ్లి బద్రినాథ్ చేరుకున్న భక్తులు ఆలయాన్ని దర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మార్చి 24న ఆశ్రమ నుంచి ఆశ్రమ వ్యవస్థాపకుడు చింత రమేశ్ ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తులు 1900 కిలోమీటర్ల మేర నడిచారని, భక్తులందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆశ్రమ వ్యవస్థాపకుడు తెలిపారు.

# ప్రత్యేక పాలనకు దూరమవుతున్న గ్రామాలు



కందకుర్తి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో మురికి కాలువలో నిండిన చెత్త

రెంజల్, జూన్ 3: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి మొదటి వారంలో ముగియడంతో వారి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది. కందకుర్తి, మౌలాలీ తండా గ్రామాలకు ప్రత్యేక అధికారిగా మొదట తహసీల్దార్ రాంచందర్ బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయన కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎంఏ ఖలీం బాధ్యతలు స్వీకరించి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల్లో ముగ్గురు తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. రెండు గ్రామాల ప్రజలకు ప్రత్యేక అధికారుల పాలన అందకుండా పోతోంది. రెంజల్, అంబేద్కర్‌నగర్ గ్రామాలకు ప్రత్యేకాధికారిగా ఉన్న ఎంపీడీవో శంకర్ బదిలీ అయ్యారు. దీంతో ఆగ్రామాలను ఉన్నతాధికారులు ఎంపీవోకు అదనంగా అప్పగించారు. కందకుర్తి, మౌలాలీ తండా జీపీలపై ఉన్నతాధికారులు చిన్న చూపు చూస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. బాధ్యతలు చేపట్టిన నెల రోజుల వ్యవధిలోనే కొత్త బ్యాంక్ జాయింట్ అకౌంట్ తీయడం, ట్రెజరీలో మార్పు చేయడంతో కార్యదర్శులకు పని భారం పెరుగుతోంది. గ్రామాల్లో తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించేందుకు జీపీల్లో నిధులు లేక, ప్రభుత్వం నెలనెలా వేయాల్సిన ఎస్‌జీఎఫ్ నిధులు మంజూరుకాక పనులు చేపట్టడం ఇబ్బందిగా ఉందని కార్యదర్శులు వాపోతున్నారు. ప్రత్యేక పాలనపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ పట్టాలు రద్దు చేయాలి

మోర్తాడ్, జూన్ 3: కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 73లో పోరంబోకు(బంజరు) భూమిని కొందరు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ అమీర్‌నగర్ గ్రామస్తులు తహసీల్దార్ ఆంజనేయులకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో రెండు మూడు సార్లు అధికారులకు విన్నవించామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమ పట్టాల విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



కమ్మర్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అమీర్‌నగర్ గ్రామస్తులు

## ఇబ్బందులు కలుగకుండా చూడాలి

శక్కర్‌నగర్, జూన్ 3: బక్రీద్ పండుగ సందర్భంగా పశువులను కొనుగోలు చేసి తీసుకుని వెళ్లే క్రమంలో ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం బోధన్ పట్టణ సీఐ వీరయ్యకు ఎంఐఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ముషీర్‌బాబా మాట్లాడుతూ పశువులను కొనుగోలు చేసి తీసుకుని వెళ్లే క్రమంలో కొందరు ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్రమంగా తీసుకుని వెళ్తే చర్యలు చేపట్టాలని, చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. నాయకులు ఖదీర్ ఖాన్, ఎజాజ్ ఖాన్, అబ్దుల్ రషీద్, అతర్, అలీముద్దీన్, ఖిజర్ పాల్గొన్నారు.

# నిరుపయోగంగా రైతుబజార్

### రోడ్లపైనే విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

ఆర్మూర్‌టౌన్, జూన్ 3: పట్టణంలోని అంగడి బజార్‌లో నిర్మించిన రైతు బజార్‌లో నిర్మించిన షాపింగ్ షెడ్లు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. కేసీఆర్ సర్కారు హయాంలో నిర్మించిన షెడ్లను అప్పటి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రారంభించారు. 15 రోజుల్లో చిరు వ్యాపారులను ఎంపిక చేసి కేటాయించాల్సి ఉంది. అధికారులు దృష్టి సారించకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతు బజార్ మందుబాబులకు అడ్డాగా మారింది. షెడ్ల ఎదుట పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. అంగడి బజార్‌లో చిరు వ్యాపారులు రోడ్లపై కూరగాయాలను విక్రయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయ. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.




నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

## జాతీయస్థాయి బాలల కథల పోటీల్లో 'విజయ్' విద్యార్థి ప్రతిభ



రిశ్విత్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, సిబ్బంది

ఖలీల్‌వాడి, జూన్ 3 : తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి బాలల కథల పోటీల్లో జిల్లాకేంద్రంలోని విజయ్ హైస్కూల్‌లో విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. 7వ తరగతి చదువుతున్న ఎం.రిశ్విత్ ఉత్తమ కథా బహుమతి అందుకున్నారని విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు అమృతలత తెలిపారు. విద్యార్థికి సారస్వత పరిషత్ వారు పంపించిన పుస్తకాలు, ప్రశంసాపత్రం, నగదు బహుమతిని సోమవారం పాఠశాలలో అందజేసి, అభినందించారు. తెలుగు రాష్ట్రాలలోని వందలాది మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా.. ఐదుగురి కథలను ఎంపిక చేసినట్లు తెలిపారు. రిశ్విత్ రాసిన 'అమ్మమాట' అనే కథకు బహుమతి లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, కరస్పాండెంట్ ప్రభాదేవి, ఐడీఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ మెంబర్ తారాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కమ్మర్‌పల్లి పద్మశాలీ సంఘం కార్యవర్గం

మోర్తాడ్, జూన్ 3: కమ్మర్‌పల్లి పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా పిల్లమారి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, కార్యదర్శిగా డాక్టర్ హన్మంతు, కోశాధికారిగా ఆడిచెర్లరాజు, దైవశెట్టిలుగా భాగ్యరాజ్, ఉదయ్‌ను ఎన్నుకున్నారు.

## నర్సరీల్లో మొక్కలకు నీరు పట్టాలి

ఏర్గట్ల, జూన్ 3: హరితహారం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలకు నీరు పడుతూ వాటిని సంరక్షించాలని ఎంపీవో శివచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీల్లో ఇప్పటికే మొక్కలు ఏపుగా పెరిగాయని, జాగ్రత్తగా కాపాడుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన సూచించారు.

## నేడు మద్యం, కల్లు దుకాణాలు మూసిఉంచాలి

బోధన్, మే 3: బోధన్ ఎక్సైజ్‌శాఖ పరిధిలోని పట్టణంతోపాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని బార్‌లు, వైన్స్‌లు, కల్లు విక్రయ కేంద్రాలను మంగళవారం మూసి ఉంచాలని బోధన్ ఎక్సైజ్‌శాఖ సీఐ పవన్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 5న ఉదయం నుంచి దుకాణాలు ప్రారంభించుకోవాలని సీఐ వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## 7న మండల సర్వసభ్య సమావేశం

నవీపేట, జూన్ 3: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7న ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు ఆయా శాఖల మండల, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## క్లీనిక్‌ల తనిఖీ

ఎడపల్లి, జూన్3: మండల కేంద్రంలోని పలు ఆర్ఎంపీ, పీఎంపీల క్లీనిక్‌లను ఎడపల్లి ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ శయీస ఫిర్దోస్ సోమవారం సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఆర్ఎంపీ, పీఎంపీలు తగిన అర్హతలు ఉండాలని సూచించారు. మెడికల్ షాపు నిర్వహించాలంటే లైసెన్స్‌తోపాటు అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, టీబీ వంటి రోగులు వస్తే తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గంగామణి, సూపర్‌వైజర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సిరికొండ, జూన్ 3 : మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన దెగావత్ సంతోష్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబానికి డీసీసీ ప్రధానకార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి రూ.5 వేలు సోమవారం అందజేశారు. పిల్లల చదువు కోసం సహాయం అందించేందుకు కృషిచేస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

## పలు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

ఇందల్వాయి, జూన్ 3 : మండలంలోని గంగారాం తండా, తిర్మన్‌పల్లి, వెంగళ్‌పాడ్ తండా గ్రామాల్లో ఎంపీడీవో అనంతరావు సోమవారం పర్యటించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు నర్సరీలను పరిశీలించారు. వానకాలంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## హోంగార్డుపై చాకుతో దాడి..

### రౌడీషీటర్ రిమాండ్

నవీపేట, జూన్ 3: సరదాగా తీసుకున్న ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని కోరినందుకు కక్ష పెంచుకున్న ఓ రౌడీషీటర్ తన బావతో కలిసి హోంగార్డుపై దాడి చేసి గాయ పర్చిన ఘటనలో రౌడీషీటర్ షేక్ సలీంను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నవీపేటకు చెందిన సాయికుమార్ నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రౌడీషీటర్ షేక్ సలీం నెల క్రితం సాయికుమార్ ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ ఇవ్వాలని ఈనెల 1న సాయికుమార్ కోరాడు. దీంతో అదే గ్రామానికి చెందిన తన బావ రహీంతో కలిసి రౌడీషీటర్ షేక్ సలీం చాకుతో హోంగార్డు సాయికుమార్‌పై దాడిచేశారు. దీంతో సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రౌడీ షీటర్‌ను పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. రహీం పరారీలో ఉన్నాడని, గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS
★Wanted Teachers to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695
NTZ-324927

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.